# పాలేరు నుదిటిపై అభివృద్ధి తిలకం
# మంత్రి శీనన్న





## అనతి కాలంలోనే పాలేరు నియోజకవర్గంలో చారిత్రక అభివృద్ధి..

- గ్రామ గ్రామాన పరిఢవిల్లుతున్న పీఎస్ఆర్ ట్రస్ట్ సేవలు
- తలుపు తల్లి సాయం అందిస్తున్న మంత్రి కుటుంబ సభ్యులు
- వరద బాధితులకు రూ.2.29కోట్ల సాయం..
- సుమారు మరో మూడు కోట్ల విలువైన వస్తు సామాగ్రి పంపిణీ..
- ప్రతిష్టాత్మక జేఎన్‌టీయూ కాలేజీ, పెద్దతండాకు మునిసిపాలిటీ హోదా..
- మున్నేరు ముంపు లేకుండా రూ.700 కోట్లతో సైడ్ వాల్స్..
- పొన్నేకల్లులో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూలు, నేలకొండపల్లిలో బౌద్ధ స్తూపానికి కొత్త రూపునకు మార్పులు..
- 650మంది బాలికలకు సైకిళ్లు
- శీనన్న చెక్కిన శిల్పంలా పాలేరుకు మహర్దశ..



వనం నాగయ్య, కెరటం న్యూస్:

**ఒప్పుకోడు పరాజయం.. ప్రజలకు** అభివృద్ధిదారి చూపడమే ఆయన ధ్యేయం.. కాలం తలరాతను చెరిపేస్తాడు.. సరికొత్త చరిత్రను నిర్మిస్తాడు.. నేతగా.. నిలువెత్తు నీతిగా.. పాలేరు ప్రజల గుండె చప్పుడులా.. రాజకీయ ప్రత్యర్థుల పాలిట ఎగిరే ధిక్కార పతాకంలా రాజకీయ విను వీధిలో సగర్వంగా రెపరెపలాడుతుంటాడు.. పీఎస్ఆర్ ట్రస్ట్ పేరుతో సేవల్లో హిమ శిఖరంలా కనిపిస్తాడు.. అందుకే గత ఎన్నికల్లో ఆయనకు పాలేరు ప్రజలు నీరాజనాలు పట్టారు.. గత చరిత్రలో ఎన్నడూ లేని మెజారిటీ కట్టబెట్టారు. పాలేరు రాజకీయాలే కాదు, ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు రాష్ట్ర రాజకీయాలనే కొత్త పుంతలు తొక్కించిన సత్యశీలి.. లక్ష్యం వదిలిన బాణంలా తనను తక్కువ చేసి చూసిన వారికి తనేంటో.. తన సత్తా ఏంటో ఫలితాలతో రుచి చూపించిన బుద్ధి కుశాలి.. ఇన్ని రకాల ఫైర్ బ్రాండ్ లక్షణాలున్న ఆ నాయకుడెవరో ఇప్పటికే మీకు అర్థమై ఉంటుంది.. అవును మీరు ఊహించింది నిజమే.. ఆయనే తెలంగాణ రాజకీయాల్లో పెను సంచలనంగా మారి ఏకంగా ఒక సీఎంకే సవాలు విసిరడమే కాకుండా.. చేసిన శపథాన్ని అక్షరాలా నిజం చేసి ప్రస్తుతం సీఎం రేవంత్ రెడ్డికి కుడి భుజంలా మారిన రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి. రాష్ట్ర ప్రజలు ముద్దుగా పిలుచుకునే శీనన్న. మరో 48గంటల్లో ఆయన పుట్టిన రోజు వేడుకలు జరుపుకునేందుకు జిల్లాలో భారీ ఏర్పాట్లు చేస్తున్నారు. రాజకీయాల్లో అడుగుపెడుతూనే కేవలం 14 నెలల్లోనే ఏకంగా పార్లమెంటులో అడుగుపెట్టి తన సత్తా ఏంటో తొలి ఎన్నికల్లోనే ఈ రాష్ట్రంలోని తన రాజకీయ ప్రత్యర్థులకు రుచి చూపించిన మంత్రి పొంగులేటి శీనన్న బర్త్‌డే సందర్భంగా కెరటం న్యూస్ అందిస్తోన్న ప్రత్యేక కథనం...

➤ మిగతా వి వరాలు 02లో..







## పరిఢవిల్లుతున్న పీఎస్ఆర్ ట్రస్ట్ సేవలు..

మంత్రి పొంగులేటి ప్రస్తుతం మంత్రిగా, పాలేరు శాసనసభ్యునిగా ఉంటూ తను ఎన్నికల్లో తన నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చేందుకు తహతహలాడుతున్నారు. అందుకే కేవలం పది నెలల్లోపే పాలేరు నుదుటిపై అభివృద్ధి తిలకం దిద్దాడు. తన ప్రజలకు కష్టం వచ్చినా, కన్నీళ్లు వచ్చినా ఇంటి కొడుకై అక్కున చేర్చుకుంటున్నాడు. ఒక పక్క ప్రభుత్వ సంక్షేమం అందిస్తూనే మరో పక్క ఆయన సొంత ట్రస్ట్ ద్వారా లెక్కలేనన్ని సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టి ఇంటింటికీ తలుపు తట్టి సాయం అందిస్తున్నారు. కేవలం కుటుంబ సభ్యులే నేరుగా ప్రజలను కలుసుకుని నగదు, వస్తు రూపేణ సాయం అందిస్తున్నారు. స్వాతంత్ర్యం సిద్ధించిన ఏడు దశాబ్దాల నుండి సనాతనంగా వస్తున్న రాజకీయాలకు సేవ అనే పేరు పెట్టిన మంత్రి పొంగులేటి సత్యశీలతకు పాలేరు ప్రజల గుండె చప్పుడులా మారాడనడంలో అతిశయోక్తి కాదు. అది వ్యాపారమైనా, రాజకీయ-ంమైనా విజయసూత్రం తెలిసిన ధీశాలిగా పాలేరు నియోజకవర్గ కంఠాన మెరు-స్తున్న వజ్రంలా కీర్తి గడించాడు.

## ఎల్లలు లేని సేవా కార్యక్రమాలు..

జిల్లా రాజకీయ వినువీధిలో ధృవతారలా వెలుగుగొందుతున్న మంత్రి శీనన్న తన పీఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలను నెమరు వేసుకుంటే ఆయన తన ప్రజలకు పంచుతున్న అభిమానం ఎలాంటిదో ఒక్క మాటలో అర్ధం అవుతుంది. ఇటీవల వరదలు వచ్చిన సందర్భంగా జిల్లాలో పాలేరు నియోజకవర్గమే ఎక్కువగా నష్టపోయింది. కూసుమంచి, తిరుమలాయపాలెం, ఖమ్మం రూరల్, నేలకొండపల్లి మండలాల్లో మొత్తం 5,181 కుటుంబాలు వరదలకు తీవ్రంగా నష్టపోయాయి. వీరిని నేరుగా మంత్రి అన్ని మండలాల్లో కలుసుకోవడమే కాకుండా వారికి ప్రత్యేక వసతి ఏర్పాటు చేసి అక్కున చేర్చుకున్నారు. ప్రభుత్వం తరపున ఏకంగా సీఎంనే తన నియోజకవర్గంలో పర్యటించేలా చేయడమే కాకుండా, కేంద్ర, రాష్ట్ర మంత్రులను కూడా రప్పించి తన ప్రజల కష్టాలు తెలిసేలా, వారికి సాయం అందించేలా విశేషంగా కృషి చేశాడని పాలేరు ప్రజలు చెప్పుకుంటుంటడం విశేషం. 5,181 కుటుంబాలకు ప్రభుత్వం ద్వారా మంజూరైన ప్రతీ ఇంటికి రూ.16వేల నగదు మొత్తం రూ.8కోట్ల 28లక్షల96వేలను బాధితుల బ్యాంకు ఖాతాల్లోకి పంపించి వారికి నూతన జీవితంపై ఆశలు రేకెత్తించాడు. ఇదే క్రమంలో తన ట్రస్ట్ ద్వారా 4,521 కుటుంబాలకు గాను రూ.5వేల చొప్పున సుమారు రూ.2.40 కోట్ల నగదును వితరణ చేశాడు. నగదు మాత్రమే కాక సుమారు రూ.3కోట్లకు పైగా విలువైన నిత్యావసరాలు, వస్తు సామాగ్రి రూపంలో అందించి రాజకీయాలు అంటే ఓట్లు సీట్లు మాత్రమే కాదనీ సేవల్లో తను శిఖర సమానుడనని నిరూపించుకున్నారు. దాదాపు పది రోజుల పాటు నియోజకవర్గంలోని వరద బాధితులకు ప్రతీ రోజూ మూడు పూటలా భోజనం పెట్టించి తన ప్రజలను కంటికి రెప్పలా కాపాడుకున్నాడు.

## శీనన్న చెక్కిన శిల్పంలా మారిన పాలేరు చిత్రం..

ప్రస్తుతం శీనన్న మంత్రిగా ఉన్న అనతి కాలంలోనే పాలేరు నియోజకవర్గం లోని నాలుగు మండలాల్లో అభివృద్ధి మంత్రం కనిపిస్తోంది. పీఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా ఎల్లలులేని సేవలు సంక్షేమం అందిస్తున్నారు. తన నియోజకవర్గంలోని 8,9,10 తరగతులు చదివే బాలికలకు 650 మందికి సైకిళ్లు అందించారు. ఇప్పటికే రెండు మండలాలు పూర్తయ్యాయి. ప్రతీ మండలానికి రెండు చొప్పున 8 ఆర్ఓఆర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి ప్రభుత్వ పాఠశాలలు, కాలేజీల్లో చదివే విద్యార్థులకు శుద్ధమైన జలం అందిస్తున్నారు. గత ఎన్నికల్లో ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చేందుకు తహతహలాడుతున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ విద్యార్థుల్లో తారతమ్యాలు లేని విధంగా ఒకే దగ్గర చదువుకునేలా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్‌ను పొన్నెకల్ వద్ద ఏర్పాటు చేస్తున్నారు. మున్నేరు వరదలు మరోసారి ముంచెత్తకుండా సుమారు రూ.700 కోట్ల వ్యయంతో మున్నేరు ఇరు వైపులా గోడ నిర్మాణానికి శరవేగంగా పనులు జరిగేందుకు కృషి చేస్తున్నారు. మద్దుల పల్లిలో జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కాలేజిని ప్రారంభించుకుని సాంకేతిక విద్యను సరికొత్తగా పరిచయం చేశారు. ఈ కళాశాలకు నూతన భవనం ఏర్పాట్లు జరుగుతున్నాయి. పెద్ద తండాకు మునిసిపాలిటీగా అప్‌గ్రేడ్ చేశారు. నియోజకవర్గంలో పోటీ పరిక్షలకు సిద్ధపడుతున్న యువతకు ఉచితంగా కోచింగ్ సెంటర్ ఏర్పాటు చేయడం, మద్దులపల్లిలో గత ప్రభుత్వంలో నిలిచిపోయిన వ్యవసాయ మార్కెట్ పనులు ప్రారంభం కావడం, కూసుమంచిలో 100 పడకల హాస్పిటల్‌గా రూపాంతరం చెందడం లాంటి సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలతో పాలేరు నుదుటిపై ఎన్నటికీ చెరగని సంతకం చేసిన శీనన్నకు ప్రజలు ఆదరిస్తున్నారు. ఇటీవల వరదల్లో షేక్ యాకూబ్, సైదాబీ అనే దంపతులు చనిపోగా వారి పిల్లలకు రూ.10లక్షల ప్రభుత్వ సాయం అందించి వారి భవిష్యత్తుకు మంత్రి శీనన్న భరోసా కల్పించారు. నేలకొండపల్లిలోని బౌద్ధ స్తూపాన్ని ప్రపంచ పర్యాటక కేంద్రంగా రూపుదిద్దేందుకు మంత్రి పొంగులేటి ప్రత్యేకంగా ప్రణాళిక రూపొందించారు. రహదారులు, అంతర్గత రహదారులు ఇలా పలు గ్రామాల్లో ప్రభుత్వ నిధులతో అభివృద్ధి పూలు పూయిస్తున్నారు.

## మంత్రి శీనన్న పాలేరు ప్రజలకు శ్రీరామ రక్ష:

- తుంబూరు దయాకర్ రెడ్డి
(మంత్రి క్యాంపు కార్యాలయ ఇంచార్జీ)

ప్రజలకు ఇచ్చిన ప్రతీ హామీని నెరవేర్చడమే మంత్రి శీనన్న ధ్యేయం. అతి కొద్ది కాలంలోనే ప్రభుత్వ పరంగా, పీఎస్ఆర్ ట్రస్ట్ పరంగా సేవలు కొనసాగుతున్నాయి. రాబోవు రోజుల్లో మరిన్ని సేవలు అందించేందుకు మంత్రి శీనన్న ఒక సమగ్రమైన విధానం కలిగి ఉన్నారు. ప్రతీ ఇంటికీ ఆయన సేవ చేయాలన్న తపన కలిగి ఉన్నారు. ఇచ్చిన హామీని నెరవేర్చడంలో ఏమాత్రం వెనకడుగు వేయరు. అందుకే ఆయన పాలేరు ప్రజల గుండె చప్పుడులా గుర్తింపు పొందారు.



